క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు

శివగంగా రాజరాజేశ్వర ఆలయంలో అభిషేకాలు



అలంకరణలో శ్రీరాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: స్థానిక శివగంగా రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం రాజేశ్వరీ అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పుష్పలంకరణ పలు కార్యక్రమాలు చేపట్టారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, డైరెక్టర్లు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

తుక్కుగూడ: వైకుంఠ ఏకాదశికి మున్సిపాలిటీ పరిధిలోని ఫ్యాబ్‌సిటీ శ్రీఆదిలక్ష్మీత బాలాజీ సమేత వేంకటేశ్వర స్వామి, జిన్నాయిగూడ శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయాలు ముస్తాబు అయ్యాయి. ఆలయాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 4.30కు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభం కానుంది. వేలాదిగా వచ్చే భక్తులకు ఆలయంలో ఇబ్బందులు రాకుండా ఏర్పాటు చేశామని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు.

నేడు ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి చింతలకుంట జనప్రియ హోమ్స్‌లోని గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి సందర్భంగా శనివారం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ పీవీ నర్సింహారావు తెలిపారు. అలాగే ధనుర్మాస విశేష కార్యక్రమాలలో భాగంగా జనవరి 8న మరిమళై సింహాసనోత్సవం, 12న కూడారై పాశురం, పాయస నివేదన, 14న గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దుతాం

మలక్‌పేట: ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్ గాంధీనగర్‌లో రూ.14 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తామని, అవసరమైన ప్రాంతాలలో కొత్త పనులు చేపడతామన్నారు. జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎఫ్‌ఏ శ్రీనివాస్, నాయకులు ప్రవీణ్‌యాదవ్, దినేష్, ఉమేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆమనగల్లు: ఆమనగల్లు ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదవ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రేణుక శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు జనవరి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

24 నుంచి మహాసభలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని సద్గురు శ్రీ నిత్య శుద్ధానందస్వామి క్షేత్రంలో ఈనెల 24 నుంచి 26 వరకు ప్రథమ అర్షవేదాంత జ్ఞాన మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ సంస్థాపకులు శ్రీశివానందస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభలను యజ్ఞ వల్క్య ఆశ్రమం పీఠాధిపతి శ్రీ పరవిద్యానందగిరి మాతాజీ ప్రారంభిస్తారని ఆయన వివరించారు. మహాసభల సందర్భంగా ప్రతిరోజు ఉదయం ప్రత్యేక పూజలు, గోపూజ, గణపతి పూజ, వాస్తుహోమం మండప పూజలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు. ప్రతిరోజూ విష్ణు సహస్రనామ అఖండ పారాయణం నిర్వహిస్తామని చెప్పారు. మహాసభల్లో సర్వేశ్వరానంద గిరిస్వామి, రామకృష్ణానంద గిరిస్వామి, సుధానంద గిరిస్వామి, పరమేశ్వరానంద గిరి మాతాజీ, లక్ష్మణానంద గిరిస్వామి తదితరులు పాల్గొంటారని ఆయన వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శివానందస్వామి కోరారు.

మార్చి 30 వరకు ఈకేవైసీ

యాచారం: గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులు ఈకేవైసీ నమోదుపై ఆందోళన చెందవద్దని యాచారం ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ఇన్‌చార్జి రవికాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు 2024 మార్చి 30లోపు ఈకేవైసీ నమోదు చేసుకోవచ్చని అన్నారు. డిసెంబర్ 30 చివరి తేదీ అని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని.. అలాంటి ప్రకటన ఏ గ్యాస్ ఏజెన్సీ చేయలేదని తెలిపారు.

పనులు పూర్తి కావు..

వెతలు తీరవు

- నత్తనడకన ఆర్‌సీఐ–నందనవనం రోడ్డు మరమ్మతులు
- ఆరు నెలలుగా కొనసాగుతున్న వైనం
- లోపించిన అధికారుల పర్యవేక్షణ

మీర్‌పేట: నత్తనడకన కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులతో మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. పనులు మొదలుపెట్టి నెలలు గడుస్తున్నా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వాస్తవ పరిస్థితులు దర్శనమిస్తోన్నాయి. ఆర్‌సీఐ నుంచి నందనవనం రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. కార్పొరేషన్ పరిధిలోని ఆర్‌సీఐ నుంచి మిథులానగర్, లలితానగర్ చౌరస్తా మీదుగా నందనవనం వరకు రహదారి విస్తరణ, అభివృద్ధి కోసం రూ.1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా ఇంకా పూర్తి కాలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో ప్రారంభించిన పనులు పూర్తి కాకపోవడంతో ఇళ్లలో నుంచి బయటకు రావాలన్నా.. కనీసం ద్విచక్ర వాహనాలను ఇళ్ల ముందు నిలుపుకోలేని పరిస్థితి ఏర్పడిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలు బంద్..

రోడ్డు పనుల కారణంగా లలితానగర్ చౌరస్తా నుంచి కమలానెహ్రూనగర్, దాసరి నారాయణరావు, మిథులానగర్ మీదుగా ఆర్‌సీఐకు వెళ్లే రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రోడ్డును తవ్వి నెలలు గడుస్తున్నా దారి అందుబాటులోకి రాకపోవడంతో గత్యంతరం లేక ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో ఇళ్ల ముందు నీరు నిలిచి పరిసరాలన్నీ బురదమయంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి తోడు అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే పనుల్లో వేగం తగ్గిందని, సంబంధిత అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని పనులు వేగంగా పూర్తి చేయాలని కాలనీవాసులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అసంపూర్తిగా ఉన్న రహదారి

త్వరలో పూర్తి చేస్తాం..

రహదారి పనుల పురోగతిపై ఉన్నతాధికారులకు నివేదించాం. రోడ్డు పనులు ఇప్పటికే సగం వరకు పూర్తయ్యాయి. మిగతా పనులు మరో 20 రోజుల్లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం. – గోపీనాథ్, డీఈ, మీర్‌పేట



వాహనాలు నిలపకుండా ఉన్న వైనం

అక్రమ నిర్మాణాలు కూల్చి వేయాలి

వైఎస్సార్‌టీపీ రాష్ట్ర యువజన విభాగం కోఆర్డినేటర్ సుమన్ గౌడ్



సుమన్ గౌడ్

పహాడీషరీఫ్: మామిడిపల్లిలో సర్వే నంబర్ 99/1 ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను పూర్తి స్థాయిలో కూల్చి వేయాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర యువజన విభాగం కోఆర్డినేటర్ గుర్జని సుమన్ గౌడ్ అధికారులను కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఎంతో విలువైన ప్రభుత్వ భూమిలో కొందరు ఇష్టానుసారంగా ఇళ్లను నిర్మించుకుంటే, బాలాపూర్ రెవెన్యూ అధికారులు గురువారం కంటి తుడుపు చర్యగా కొన్నింటినే కూల్చి వేశారన్నారు. దీంతో గ్రామస్తులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారన్నారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఆక్రమణలు తొలగించాలన్నారు.

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు



కందుకూరు చౌరస్తాలో జేసీబీతో తవ్వకాలు చేపడుతున్న అధికారులు

కందుకూరు: 'సాక్షి' కథనానికి ఎట్టకేలకు అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. మండల కేంద్రంలోని శ్రీశైలం ప్రధాన రహదారిపై తొమ్మిది నెలలకు పైగా మిషన్ భగీరథ పైప్‌లైన్ నుంచి తాగునీరు లీకు అవుతూ వృథాగా మారడంతో పాటు మురుగు నీరు కలిసి కలుషితమవుతున్నాయి. దీంతో ఈ నెల 13న 'వృథా అవుతున్నా.. యంత్రాంగం కదలదే!' అనే శీర్షికతో కథనం ప్రచురితమయింది. దీనిపై స్పందించిన మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శుక్రవారం లీకవుతున్న ప్రాంతంలో జేసీబీతో తవ్వకాలు చేపట్టి పైప్‌లైన్‌కు మరమ్మతులు పూర్తి చేశారు. ఇబ్బందులు తొలగడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా మ్యాథ్స్ ఫెయిర్

బాలికల పాఠశాలలో రామానుజన్ జయంతి

కందుకూరు: ప్రఖ్యాత భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని కందుకూరు బాలికల పాఠశాలలో శుక్రవారం మ్యాథ్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్రానికి సంబంధించిన నమూనాలను విద్యార్థినులు తయారు చేసి ప్రదర్శించి తమ ప్రతిభను చాటారు. ముఖ్య అతిథిగా బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజయ్య పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థినీలను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయినీలు రచన, కాంచన, రమాదేవి, భాగ్య, జ్యోతి పాల్గొన్నారు.

లార్డ్స్‌లో జాతీయ గణిత దినోత్సవం

మీర్‌పేట: మీర్‌పేట జిల్లెలగూడలోని లార్డ్స్ పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి స్కూల్స్ చైర్మన్ సిద్దాల బీరప్ప ముఖ్య అతిథిగా హాజరై గణిత శాస్త్రం ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన గణిత నమూనాలను ఆయన పరిశీలించారు. డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కందుకూరు: గణిత నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



మీర్‌పేట: గణిత దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వెంచర్‌లో వెంకన్న విగ్రహం



బయటపడిన వేంకటేశ్వరస్వామి విగ్రహానికి పూజలు చేసిన భక్తులు

- ప్లాటు చదును చేస్తుండగా బయటపడ్డ స్వామి వారి ప్రతిమ
- పూజలు చేసిన స్థానికులు

మహేశ్వరం: వెంచర్‌లో ఓ ప్లాటును చదును చేస్తుండగా వేంకటేశ్వర స్వామి విగ్రహం బయట పడింది. ఈ సంఘటన మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీశివగంగా రాజరాజేశ్వర స్వామి ఆలయం సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. మహేశ్వరం గ్రామ శివారులో శివగంగా ఆలయం ముందున్న స్థలంలో రియల్ వ్యాపారులు కొన్నేళ్ల క్రితం వెంచర్‌ను నిర్మించారు. అయితే అందులో గ్రామానికి చెందిన కాకి కుమార్ ఓ ప్లాటును కొనుగోలు చేశారు. ఆ స్థలాన్ని జేసీబీ సహాయంతో చదును చేస్తుండగా మూడు అడుగుల శ్రీ వేంకటేశ్వర స్వామి విగ్రహం బయట పడింది. ఈ సమాచారం బయటికి రావడంతో భారీ సంఖ్యలో జనాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తవ్వకాల్లో బయటపడ్డ స్వామి వారి విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి వేదమంత్రాలతో కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహం గురించి పురావస్తు శాఖ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. ప్రస్తుతం విగ్రహాన్ని వారు పరిశీలిస్తున్నారు. వెంచర్‌లో విగ్రహం బయట పడటం పట్ల పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వెలువడిన స్థలాన్ని కబ్జా చేసుకొని అక్కడ ఆలయం నిర్మాణం చేయడానికి కసరత్తు చేస్తున్నారని కొందరు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విగ్రహం ఇటీవలే కొత్త రాతితో తయారు చేసినట్లు ఉందని అనుమానిస్తున్నారు. తవ్వకాల్లో బయటపడిన ప్రదేశాన్ని పురావస్తు, దేవాదాయ అధికారులు వెంటనే సందర్శించి విగ్రహం ఎప్పటిదో పూర్తి వివరాలు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

వైకుంఠ శోభ



వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలు శోభాయమానంగా వెలుగులీనుతున్నాయి. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పహాడీషరీఫ్ పరిధిలోని మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది. – పహాడీషరీఫ్

ప్రభుత్వ బడుల్లో వసతులు కల్పిస్తాం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే ధ్యేయంగా ఐక్యతా ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముద్విన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కాన్ అండ్ లర్నింగ్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ చదువులకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా డిజిటల్ కంటెంట్ పుస్తకాలను రూపొందించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు ఈ పాఠ్యపుస్తకాలను అందిస్తామన్నారు. అదేవిధంగా ముద్విన్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు, పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. పాఠశాలలో శుద్ధ తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్మలాదేవి, మాజీ సర్పంచ్ యాదయ్య, ఉపాధ్యాయులు చంద్రయ్య, పాఠశాల చైర్మన్ నర్సింహ, నాయకులు మధు, నర్సింహ, ప్రవీన్, సురేశ్, మహేశ్, శ్రీశైలం, యాదయ్య, నారాయణరెడ్డి, వెంకటేశ్ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటవిడుపు ఉండాలి

ఎమ్మెల్సీ వెంకటనారాయణరెడ్డి

మంచాల: క్రీడలు శారీరక ఎదుగుదలకు ఎంతో అవసరమని ఎమ్మెల్సీ వెంకటనారాయణ రెడ్డి అన్నారు. గురు, శుక్రవారాల్లో మంచాల మండల పరిధిలోని కాగజ్‌ఘాట్‌లోని సిరినేచర్ వ్యాలీ రిసార్ట్స్‌లో రంగారెడ్డి జిల్లా ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ఎప్పుడు ఉరుకులుపరుగులతో బిజీగా ఉంటామని.. అప్పుడప్పుడు క్రీడోత్సవాలు జరుపుకోవడం ద్వారా ప్రశాంతత లభిస్తుందన్నారు. విద్యార్థుల మాదిరిగానే ఉపాధ్యాయులకు ఆటవిడుపు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఉపాధ్యాయులు

రైతుబంధు డబ్బులు జమ చేయండి

రైతుసంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

యాచారం: రైతుబంధు డబ్బులను వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని రైతుసంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ... ప్రతి ఏడాదిలాగే రైతులు ఇప్పటికే వ్యవసాయ పొలాలను సిద్ధం చేసుకుని పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వెంటనే రైతుబంధు నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు నిధులు ఉన్నాయని, నేడు నిధులు లేవని రైతుల ఖాతాల్లో రైతుబంధు నిధులు జమ చేయకపోవడం సరైంది కాదని అన్నారు. పట్టాదారు, పాసుపుస్తకాలున్న రైతులకు మొత్తం నిధులు జమచేయాలని డిమాండ్ చేశారు.

అవిశ్వాసంపై వెనక్కి

తలకొండపల్లి: ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని ఇటీవల ఆర్డీఓను కోరిన ఎంపీటీసీ సభ్యుల్లో ఇద్దరు సభ్యులు ఆ ప్రతిపాదనను ఉపసంహరించుకున్నారు. ఈమేరకు ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. తలకొండపల్లి ఎంపీపీ నిర్మలపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని మండల ఎంపీటీసీలు ఈనెల 20న కందుకూర్ డివిజన్ ఆర్డీఓ సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మొత్తం 12మంది ఎంపీటీసీలుండగా.. అందులో ఏడు మంది ఎంపీటీసీ సభ్యులు ఆర్డీఓకు వినతిపత్రం ఇచ్చారు. అయితే అవిశ్వాసానికి మద్దతు ఇచ్చిన ఏడు మందిలో ఇద్దరు సభ్యులు.. చౌదర్‌పల్లి ఎంపీటీసీ సభ్యురాలు పెంటమ్మ, తలకొండపల్లి ఎంపీటీసీ సభ్యురాలు హేమరాజు తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్డీఓకు తెలిపారు. దీంతో అవిశ్వాస తీర్మాణానికి సరిపడా మెజార్టీ తగ్గిపోయింది.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని శుక్రవారం ఎంపీడీఓ విజయలక్ష్మి తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. యాచారం మండల అభివృద్ధి కోసం తీసుకుంటున్న చర్యలు, నర్సరీల ఏర్పాటు, కోవిడ్ నివారణ జాగ్రత్తలపై ఎమ్మెల్యేకు ఆమె వివరించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్, పంచాయతీ రాజ్ ఏఈ ఉస్మాన్, నాయకులు అరవింద్‌నాయక్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్‌రెడ్డిని కలిసిన సర్పంచ్‌లు

అబ్దుల్లాపూర్‌మెట్ : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన పలువురు సర్పంచ్‌లు కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు వీరస్వామిగౌడ్, సంతోషకిషన్, లావణ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాధాలక్ష్మారెడ్డి, వనజ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసిన ఎంపీడీఓ విజయలక్ష్మి

గ్రహణం వీడేనా?

- స్థల ఎంపిక దగ్గరే ఆగిపోయిన మున్సిపల్ భవన నిర్మాణ పనులు
- కోర్టు కేసుతో శంకుస్థాపనకు బ్రేక్
- కొత్త ప్రభుత్వమైనా పూర్తిచేయాలంటున్న ప్రజలు

అబ్దుల్లాపూర్‌మెట్: గత కొంతకాలంగా ఒక అడుగు ముందుకు... రెండు అడుగులు వెనక్కి అన్నట్లుగా కొనసాగుతున్న పెద్దఅంబర్‌పేట మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి ఆది నుంచీ ఆటంకమే ఎదురవుతున్న విషయం తెలిసిందే. మున్సిపల్ పరిధి 4వ వార్డులోని సర్వేనంబర్ 123/1,2లోని రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.7కోట్లతో నిర్మించతలపెట్టిన నూతన భవన నిర్మాణానికి కౌన్సిల్‌లోని ఓ వర్గం సభ్యులు వ్యతిరేకించినప్పటికీ అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి జోక్యంతో మెజార్టీ సభ్యుల అంగీకారం తెలిపిన విషయం తెలిసిందే. అయితే అన్నీ అనుకున్న విధంగా ముందుకు సాగితే గత డిసెంబర్ రెండవ వారంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయాల్సి ఉండగా అదే సమయంలో ఇక్కడ పని చేసిన కమిషనర్ రామాంజులరెడ్డితో పాటు ఆయన తర్వాత వచ్చిన సత్యనారాయణరెడ్డి కూడా బదిలీకావడంతో ఆగస్టులో రవీందర్‌రెడ్డి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించగా తాత్కాలికంగా శంకస్థాపన పనులు వాయిదా పడ్డాయి. దీనికి తోడు మున్సిపల్ భవనానికి కేటాయించిన స్థలంపై కోర్టు వివాదం కొత్తగా వచ్చి చేరింది. కాగా ఇటీవలజరిగిన సాధారణ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మల్‌రెడ్డిరంగారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. అయితే కొత్త ప్రభుత్వం, నూతన ఎమ్మెల్యే పాలనలోనైనా మున్సిపల్ భవనం ఎలాంటి ఆటంకం లేకుండా నిర్మాణం పూర్తయ్యే విధంగా ముందుకు సాగాలని ప్రజలు కోరుతున్నారు.